



మిడుతూరు మండలం ఎస్సీ కాలనీలో నీట మునిగిన కారు



సంజామల సమీపంలోని పాలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు




దద్దనాల ప్రాజెక్టుకు చేరిన వరద నీరు



చాగలమర్రిలో జలమయమైన పశువైద్యశాల రహదారి

కురిసింది వాన మురిసింది నేల



గడివేముల: ఉధృతంగా పొంగి పొర్లుతున్న పాలేరు వాగు



పోలీసు బందోబస్తును నిర్వహిస్తున్న ఎస్ఐ రమేశ్‌రెడ్డి



బేతంచెర్ల డోన్ రోడ్డులో పొంగిపొర్లిన ముచ్చట్ల వాగు

- ఉరుములు, మెరుపుల జడవాన
- పలుచోట్ల రాకపోకలకు అంతరాయం
- జిల్లా వ్యాప్తంగా విస్తారమైన వర్షాలు

నంద్యాల టౌన్, జూన్ 6 : నైరుతి రుతుపవనాల కారణంగా జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం తెల్లవారుజాము వరకు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలు చోట్ల రహదారులు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. దీంతో గ్రామాలకు రవాణా సౌకర్యం నిలిచిపోయింది. సంజామల, బేతంచర్ల, మిడ్తూరు తదితర మండలాల్లో భారీ వర్షం కారణంగా వాగులు, వంకలు పొంగిపొర్లాయి. బేతంచర్ల మండలంలో అత్యధికంగా 94.2 మి.మీ వర్షపాతం కురిసింది. సంజామల మండలంలో 93.0, పాణ్యంలో 66.8, బండిఆత్మకూరులో 64.8, డోన్‌లో 49.2, గోస్పాడులో 39.2, అవుకులో 33.4, బనగానపల్లెలో 33.3, నందికొట్కూరులో 32.4, కొలిమిగుండ్లలో 31.8, దొర్నిపాడులో 26.6, మిడ్తూరులో 26.4, శిరివెళ్లలో 20.0, కోవెలకుంట్లలో 20.0, మహానందిలో 19.2, ఆత్మకూరులో 17.8, గడివేములలో 16.8, నంద్యాలలో 12.8, వెలుగోడులో 10.2, జూపాడు బంగ్లాలో 8.8, ప్యాపిలో 7.8, ఆళ్లగడ్డలో 6.8, చాగలమర్రిలో 5.0, శ్రీశైలంలో 4.8, ఉయ్యాలవాడలో 4.0, పాములపాడులో 2.8, పగిడ్యాల మండలంలో 2.4 మి.మీ వర్షం కురిసింది. జిల్లా వ్యాప్తంగా సరాసరి 25.9 మి.మీ వర్షం కురిసినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి.

కుందూ, కాకిలేరు వాగుల్లో వరద

మిడుతూరు: మండలంలో అర్ధరాత్రి నుంచి ఉదయం వరకు కురిసిన భారీ వర్షం కారణంగా మిడుతూరు, చింతలపల్లి, చౌట్కూరు, తలముడిపి, చెరుకుచెర్ల పీరుసాహేబ్‌పేట గ్రామాల్లో కుందూ, కాకిలేరు వాగులు ఉధృతంగా ప్రవహించాయి. నందికొట్కూరు నుంచి నంద్యాలకు, మిడుతూరు నుంచి ఓర్వకల్లు, మిడుతూరు నుంచి కడుమూరు గ్రామాల మధ్య రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎస్సీ కాలనీలో వర్షానికి కారు కొంతమేర కొట్టుకుపోయింది. మిడుతూరుకు చెందిన తెలుగు వెంకటలక్ష్మమ్మకు చెందిన ఇళ్లు పూర్తిగా నేలమట్టమైంది. ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, టీడీపీ మండల కన్వీనర్ కాతా రమేష్ రెడ్డి ఎస్సీకాలనీకి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. కుందూ, కాకిలేరు ప్రవాహాలను తహసీల్దార్ తులశమ్మ, ఆర్ఐ బాషా పరిశీలించారు.

నందికొట్కూరు రూరల్: నందికొట్కూరు మండలంలో భారీ వర్షం కురవడంతో వాగులు, వంకలు పొంగి పొర్లాయి. వడ్డెమాను, అల్లూరు, బ్రాహ్మణ కొట్కూరు గ్రామానికి మధ్య వంతెన, రోడ్డు కూడా పూర్తిగా కొట్టుకపోయింది.

చాగలమర్రి: మండలంలోని రాజోలి ఆనకట్ట వద్ద కుందూ వరద నీటితో ఉగ్రరూపం దాల్చింది. గురువారం ఎగువ నుంచి వరద నీరు ఆనకట్టకు చేరింది. కుందూనది వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తోంది. రెండు రోజుల్లోనే కుందూ నీటిమట్టం పెరిగింది. ఆనకట్ట నుంచి కడప జిల్లా వైపు 5 గేట్లను ఎత్తి నీటిని విడుదల చేశారు. పక్కనే ఉన్న కేసీ కెనాల్ గేట్లను ముందస్తుగా మూసి వేశామని కేసీ కెనాల్ ఏఈ జమాల్‌వలి తెలిపారు.

దద్దనాల ప్రాజెక్టుకు జలకళ

బనగానపల్లె, జూన్ 6: బనగానపల్లె పట్టణంలోని దద్దనాల ప్రాజెక్టు జలకళ సంతరించుకుంది. గురువారం తెల్లవారుజామున కురిసిన భారీ వర్షానికి 15 అడుగుల వరకు నీరు చేరింది. ప్రాజెక్టు పైభాగంలోని మద్దిలేటిస్వామి కొండలో నుంచి ప్రాజెక్టు వరద పోటెత్తింది. ప్రాజెక్టు గరిష్ట సామర్థ్యం 25 అడుగులు.

ఉధృతంగా కుందూనది

గడివేముల: మండలంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కుందూ నదికి ప్రవాహం అధికమైంది. మిడుతూరు మండలం తలమొడిపి గ్రామం వద్ద కుందూనది బ్రిడ్జి పైనుంచి వరద పోటెత్తింది. దీంతో కుందూ పరివాహక ప్రాంతంలోని పొలాలన్నీ నీట మునిగాయి.

పాలేరు వాగులో చిక్కుకున్న ఆర్టీసీ బస్సు

- 14 మంది ప్రయాణికులు సురక్షితం

సంజామల : సంజామల సమీపంలోని పాలేరు వాగు, గోంద్రవాగు, కప్పల వాగు ఉప్పొంగి ప్రవహించాయి. కోవెలకుంట్ల నుంచి సంజామల మీదుగా, పేరుసోముల, తిమ్మనాయునిపేట, తదితర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. పాలేరు వాగు ప్రమాదకర స్థాయిలో ఉండటంతో తహసీల్దారు జ్యోతి రత్నకుమారి, ఎస్ఐ రమేశ్‌రెడ్డి, వీఆర్వో సుబ్బరాయుడు తదితరులు పటిష్టభద్రతా ఏర్పాట్లు చేశారు. కోవెలకుంట్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు సంజామల పాలేరు వాగులో చిక్కుకుంది. కోవెలకుంట్ల డిపో నుంచి నైట్‌హాల్ట్ బస్సు సంజామల మీదుగా కొండ సుంకేసులకు వెళ్లిన బస్సు కొండ సుంకేసుల నుంచి కోవెలకుంట్లకు బయలుదేరింది. సంజామల పాలేరు వాగు పొంగి ప్రవహించడంతో ఆర్టీసీ బస్సు డ్రైవర్ బస్సును ఎలాంటి ప్రమాదం జరుగకుండా వాగులోకి దించారు. రోడ్డుకు ఇరువైపుల ప్రమాద సూచికలు కనబడకపోవడంతో బస్సు అదుపుతప్పి వాగులోకి ఒరిగింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ రమేశ్ రెడ్డి సిబ్బందితో పాలేరు వాగు వద్దకు వెళ్లి క్రేన్ సహాయంతో బస్సును బయటకు తీశారు. బస్సు డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంలో 14 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ బస్సు 3 అడుగులు వెనుకకు పడి ఉంటే పెద్ద ప్రమాదమే జరిగేది.



మిడుతూరులో వంతెన ఎక్కి ప్రవహిస్తున్న కాకిలేరు



నేల కూలిన ఇల్లు



నందికొట్కూరు రూరల్: వడ్డెమాను అల్లూరు గ్రామాల మధ్య ఇలా...



రాజోలి ఆనకట్టపై పొంగి ప్రవహిస్తున్న వరద నీరు

మన వాటా 27.585 టీఎంసీలు

- ఎల్లెల్సీకి 19.472 టీఎంసీలు
- 8.113 టీఎంసీలు కేసీ కోటా
- తుంగభద్ర డ్యాంలో 172 టీఎంసీల నీటి లభ్యత
- టీబీపీ బోర్డ వాటర్ రివ్యూ కమిటీ సమావేశం

కర్నూలు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర జలాశయంలో 2024-25 నీటి సంవత్సరంలో 172 టీఎంసీలు నీటి లభ్యత ఉంటుందని, కేడబ్ల్యూడీటీ దామాషా ప్రకారం కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ, కేసీ కెనాల్ నీటి వాటాగా 27.585 టీఎంసీలు కేటాయించారు. గురువారం తుంగభద్ర ప్రాజెక్టు బోర్డు వాటర్ రివ్యూ కమిటీ సమావేశం కర్ణాటక రాష్ట్రం హోస్పెట్‌లోని టీబీపీ బోర్డు కార్యాలయంలో జరిగింది. బోర్డు ఎస్ఈ శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కర్నూలు ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈ రెడ్డిశేఖర్ రెడ్డి సహా అనంతపురం ఎస్ఈ రాజశేఖర్, కర్ణాటక ఎల్‌బీఎంసీ ఎస్ఈ బసవరాజ్‌నాయక్ తదితరులు హాజరు అయ్యారు. గత పదేళ్లగా తుంగభద్రకు వచ్చిన వరద, డ్యాంలో చేరిన వరద, నీటి వినియోగం లెక్కల ఆధారంగా ఈ నీటి సంవత్సరంలో 1723 టీఎంసీలు చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. కృష్ణా వాటర్ డిస్ప్యూట్ ట్రైబ్యూనల్ (కేడబ్ల్యూడీటీ) దామాషా ప్రకారం ఏపీ, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల వాటాను నిర్ణయించారు. ముందస్తు రుతుపవనాలు రావడంతో డ్యాంలో ఆశాజనంగా వరద చేరే అవకాశం ఉందని అంచనా వేశారు. ఏపీ వాటాగా 53.953 టీఎంసీలను కేటాయించారు. ఎల్లెల్సీ వాటా 24 టీఎంసీలకు గాను 19.472 టీఎంసీలు, కేసీ కెనాల్ వాటా 10 టీఎంసీలకు గాను 8.113 టీఎంసీలు, అనంతపురం జిల్లా హెచ్చెల్సీ వాటా 35.5 టీఎంసీలకు గాను 26.368 టీఎంసీలు ఇవ్వవచ్చని అంచనా వేశారు. అలాగే తెలంగాణ వాటా కింద 5.282 టీఎంసీల నీటిని ఆర్‌డీఎస్ కాలువ ద్వారా అందించాలని నిర్ణయించారు. కర్ణాటకకు 112.765 టీఎంసీల నీటిని కేటాయించారు. తుంగభద్ర జలాశయం పూడిక చేరడంతో నీటి నిల్వలు గణనీయంగా తగ్గిపోయాయి. వాస్తవంగా 115 టీఎంసీలకుగా నీటి నిల్వ సామర్థ్యం 105 టీఎంసీలకు తగ్గించారు. 205 టీఎంసీలకుపైగా నీటి లభ్యత ఉంటే బచావత్ అవార్డు దామాషా ప్రకారం ఆయా కాల్వలకు నీటి వాటాలను వంద శాతం కేటాయిస్తారు. డ్యాంలో కనిష్ఠంగా 40 టీఎంసీలు చేరితే ఈ ఏడాది జూలై 20 తరవాత కర్నూలు, అనంతపురం జిల్లాల ఇంజనీర్లు ఇచ్చే ఇండెంట్ మేరకు ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కాల్వలకు నీరు విడుదల చేసే అవకాశం ఉంది.



టీబీపీ బోర్డు కార్యాలయంలో మూడు రాష్ట్రాల ఎస్ఈల సమావేశం

పర్క్యులేషన్ ట్యాంకు ఆనకట్టకు గండి

- నాసిరకం గ్రావెల్ వాడకమే కారణం
- మొదటిసారి వరదకే తెగిన ఆనకట్ట
- రూ. 2.90 కోట్ల నిధులు నీళ్ల పాలు

బనగానపల్లె రూరల్, జూన్ 5: యాగంటి క్షేత్రం దిగువ ప్రాంతంలో నిర్మించిన పర్క్యులేషన్ ట్యాంక్ ఆనకట్టకు భారీ గండి పడింది. యాగంటి సమీంలోని ఎర్రమల కొండల్లో నుంచి వచ్చే వరద నీరును నిల్వ చేస్తే పాతపాడు, మీరాపురం, మాదాసుపల్లె తదితర గ్రామ రైతులకు ఉపయోగపడటంతో పాటు భూగర్భ జలాలు పెరుగుతాయనే ఉద్దేశంతో పర్క్యులేషన్ ట్యాంక్ ఏర్పాటు చేశారు. దాదాపు రూ.2.90 కోట్ల నిధులతో ఏడాది క్రితం నిర్మాణం పూర్తి చేశారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా పర్క్యులేషన్ ట్యాంక్‌లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం ఉదయం ట్యాంక్ ఆనకట్టకు గండి పడి మట్టి కొట్టుకుపోయింది. వరద ప్రవాహం మరింత ఎక్కువైతే ఆనకట్ట మొత్తం కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంటుంది. అయితే మొదటిసారి వచ్చిన వరదకే పర్క్యులేషన్ ట్యాంక్ ఆనకట్టకు గండి పడి కొట్టుకుపోవడం చూస్తే నిర్మాణంలోని డొల్లతనం బయటపడుతోంది. ట్యాంకు ఆనకట్ట నిర్మాణంలో నాణ్యత పాటించ లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాసుల కోసం కక్కుర్తి పడ్డ కాంట్రాక్టర్ నాణ్యమైన గ్రావెల్‌ను వాడకుండా చుట్టు పక్కల ఉన్న గ్రావెల్‌ను తరలించి ఆనకట్ట నిర్మించడం వల్లే మొదటిసారి వచ్చిన వరద ప్రవాహానికి కట్ట తెగిపోయిందని పాతపాడు గ్రామ సర్పంచ్ బెడదల మహేశ్వరరెడ్డి ఆరోపించారు. చౌడు పొలాల్లో ఉండే నాణ్యతలేని గ్రావెల్‌ను వాడటంతో పాటు కట్ట నిర్మాణ సమయంలో రోలింగ్, క్యూరింగ్ సరిగా చేయకపోవడంతో ఏడాదికే కట్ట బలహీనపడిందన్నారు. నిర్మించిన ఏడాదికే ఆనకట్ట వరద నీటిలో కొట్టుకపోవడంతో కోట్ల రూపాయల నిధులు నీళ్ల పాలయ్యాయి. ఈ ఘటనపై మైనర్ ఇరిగేషన్ ఏఈ రఘురాం మాట్లాడుతూ నీటి ప్రవాహం అధికంగా రావడంతో ఆనకట్టకు గండి పడిందని, యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చే పనులు ప్రారంభించామని అన్నారు. గండి పూడ్చడానికి మిషన్లు తరలించామని అన్నారు. ఏది ఏమైనా తొలిసారి వర్షానికే కట్ట తెగిపోవడం కాంట్రాక్టర్, అధికారుల డొల్లతనం బయటపడుతోంది. నాసిరకం నిర్మాణంపై విజిలెన్సు విచారణ జరిపి సదరు కాంట్రాక్టరు, అధికారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



తెగిన పర్క్యులేషన్ ట్యాంకు ఆనకట్ట

చంద్రబాబు, నారా లోకేశ్‌తో బీసీ భేటీ

బనగానపల్లె, జూన్ 6: బనగానపల్లె ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కలిశారు. గురువారం విజయవాడలోని ఉండవల్లి నివాసంలో ఇరువురి నేతలను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బనగానపల్లె నియోజకవర్గంలో భారీ మెజార్టీతో గెలుపొందిన బీసీ జనార్దన్‌రెడ్డిని చంద్రబాబు, నారా లోకేశ్ ప్రత్యేకంగా అభినందించారు. రాబోయే కాలంలో బీసీ జనార్దన్‌రెడ్డికి మంచి భవిష్యత్ ఉంటుందని వారు భరోసా ఇచ్చారు.





టీడీపీ అధినేత చంద్రబాబు, నారా లోకేశ్‌ను కలిసి బీసీ జనార్దన్‌రెడ్డి

బాబును కలిసిన అఖిలప్రియ

ఆళ్లగడ్డ, జూన్ 6: కాబోయే సీఎం చంద్రబాబు నాయుడును ఆళ్లగడ్డ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అఖిలప్రియ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమె విజయవాడలోని చంద్రబాబు నివాసంలో కలిసి అభినందనలు తెలిపారు. ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆమె చంద్రబాబును కలిసి అభినందించారు.



మల్లన్న సన్నిధిలో ఎమ్మెల్యే బుడ్డా

శ్రీశైలం, జూన్ 6: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను గురువారం శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఈ డి. పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులు స్వామివారికి రుద్రాభిషేకం, భ్రమరాంబికాదేవి అమ్మవారికి కుంకుమార్చనను జరిపించుకున్నారు. దర్శనానంతరం బుడ్డా రాజశేఖరరెడ్డి దంపతులకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.



అప్పుల బాధతో యువరైతు ఆత్మహత్య

- కడసారి భార్య, బిడ్డలను చూసి బలవన్మరణం


వడ్డె బజారి (ఫైల్)

ఎమ్మిగనూరు, జూన్ 6: పంటల దిగుబడులు లేక సాగుకోసం చేసిన అప్పులు తీర్చే దారిలేక ఓ యువ రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం ఎమ్మిగనూరు మండలం బోడబండ గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వడ్డె బజారి(39)కి ఏడు ఎకరాల పొలం ఉంది. దీనికి తోడు మరో మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని కొంతకాలంగా వివిధ రకాల పంటలను సాగుచేస్తున్నాడు. తన సొంత పొలంలో అప్పులు చేసి రెండు బోర్లు వేయించి మిరప పంట సాగుచేశాడు. అయితే పంటల దిగుబడి ఆశించిన మేర రాకపోవడంతో పూర్తిగా నష్టపోయాడు. అప్పులు పెరిగి దాదాపు రూ. 10 లక్షలకు చేరాయి. ఈ క్రమంలో రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. దీంతో దీంతో ఆత్మహత్య శరణ్యమని భావించాడు. బంధువుల ఇంట్లో శుభకార్యం నిమిత్తం భార్య, పిల్లలను కర్ణాటకలోని బళ్లారి జిల్లా కురుగోడు (భార్య పుట్టినిల్లు)కు పంపాడు. రెండు రోజుల క్రితం రైతు బజారి కురుగోడుకు వెళ్లి భార్య, పిల్లలను కడసారి చూసి.. అదే గ్రామంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు హుటా హుటిన బళ్లారి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బజారి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహాన్ని రైతు బజారి స్వగ్రామం బోడబండకు తీసుకొచ్చి గురువారం అంత్యక్రియలు నిర్వహించారు. రైతు బజారికి భార్య సరస్వతి, పిల్లలు రేణుక, అనుపమ, కుమారుడు మహేష్ ఉన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

పాణ్యం, జూన్ 6: ఉమ్మడి కర్నూలు జిల్లాలోని మహాత్మా జ్యోతిరావుపూలే బీసీ గురుకుల పాఠశాలలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు గురుకుల పాఠశాలల కన్వీనర్ ఫ్లోరమ్మ తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ ఇంగ్లీషు మీడియంలో 2024- 25 సంవత్సరానికి గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలో బాలికలకు నెరవాడ, ఆరెకల్, ఆళ్ళగడ్డ, వెల్దుర్తి బాలురకు బనగానపల్లె, గోరంట్ల పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 6,7,8,9, తరగతిలో వివిధ క్యాటగిరిలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈనెల 5 వతేదీ లోపు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశ పరీక్ష ఈనెల 20 తేదీన వారి సొంత జిల్లాల కన్వీనర్ ప్రిన్సిపాల్ స్కూలులో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ. లక్ష మించరాదన్నారు. పూర్తి వివరాలకు ఆయా ప్రిన్సిపాళ్లను సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు నెరవాడ 9866559668, ఆరెకల్ 9705984824, ఆళ్లగడ్డ 7981458148, వెల్దుర్తి 9550645847, బనగానపల్లె 9966345050, గోరంట్ల 9703083764 నెంబర్లతో సంప్రదించాలన్నారు.

విజేతలకు ఈ పోస్టు ద్వారా శుభాకాంక్షలు

కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), జూన్ 6: 2024 సార్వత్రిక ఎన్నికల్లో విజేతలైనవారికి ఈ పోస్టు ద్వారా అభినందనలు తెలిపేందుకు తపాలా శాఖ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దన్‌రెడ్డి తెలిపారు. గురువారం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ విజయం సాధించిన ప్రజాప్రతినిధికి ఈ పోస్టు సందేశాల ద్వారా వారి విజయానికి హృదయపూర్వక అభినందనలు, వారి రాబోయే పదవీకాలానికి శుభాకాంక్షలు తెలియజేయడానికి ఉపయోగపడుతుందన్నారు. ప్రజలు, అభిమానులు కేవలం రూ.12 చెల్లించి దగ్గరలోని ఏదైనా పోస్టాఫీసులో ఈ పోస్టు ద్వారా తమ ప్రియతమ నేతలకు శుభాకాంక్షలు పంపవచ్చన్నారు. ఈ సందేశాలు నేరుగా ఆ నాయకుల చేతికే చేరుతాయన్నారు.

గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలు


ఈవీఎం గోడౌన్ గదికి సీల్ వేస్తున్న సిబ్బంది

కర్నూలు(కలెక్టరేట్), జూన్ 6: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కౌంటింగ్ అనంతరం ఈవీఎంలను నియోజకవర్గాల వారీగా కలెక్టరేట్‌లోని ఈవీఎం గోడౌన్‌లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో భద్రపరిచి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.జి. సృజన సీల్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈవీఎం గోడౌన్‌లోని కింద అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన వీవీ ప్యాట్‌లను, పైన అంతస్తులో అసెంబ్లీ, పార్లమెంటుకు సంబంధించిన బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లను భద్రపరిచి సీల్ చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డీఆర్వో మధుసూదన్‌రావు, డీపీవో నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

వ్యక్తి దారుణ హత్య..

వివాహేతర సంబంధమే కారణమని ఆరోపణ


మంజుల నాగేంద్ర (ఫైల్)

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో ఓ వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. గ్రామానికి చెందిన వడ్డె మంజుల నాగేంద్ర(35)ను బుధవారం రాత్రి పొద్దుపోయాక అదే గ్రామానికి చెందిన మంజుల పెద్దపుల్లయ్య, మంజుల రామాంజి, మంజుల మనోహర్ గ్రామ సమీపంలోని గంగమ్మ గుడి వద్దకు రావాలని, కలిసి మద్యం తాగుదామంటూ పిలిపించారు. మద్యం తాగాక వారు నాగేంద్రపై దాడిచేసి బండరాళ్లు, సుత్తెలతో మోది హత్య చేసినట్లు కొలిమిగుండ్ల సీఐ గోపీనాథరెడ్డి తెలిపారు. పెద్దపుల్లయ్య, మంజుల రామాంజిలకు తన భార్యతో చనువుగా వుంటున్నారని మందలించినందుకే నాగేంద్రను వాళ్లు హత్య చేశారని వెల్లడించారు. మృతుడి సోదరుడు మంజుల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మాజీ జడ్పీటీసీ సభ్యుడి అరెస్టు

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6: మండలంలోని పేట్నికోట గ్రామంలో మే 13న పోలింగ్ సందర్భంగా జరిగిన ఘటనలో నిందితుడైన వైసీపీ యువనేత, మాజీ జడ్పీటీసీ ఎర్రబోతుల ఉదయ్ భాస్కరరెడ్డిని గురువారం కోవెలకుంట్లలో అరెస్టు చేసినట్లు ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ కేసుతో పాటు హత్యాయత్నం కేసులో ఎర్రబోతుల ఉదయ్‌భాస్కరరెడ్డి నిందితుడిగా ఉన్నట్లు ఆయన వెల్లడించారు. కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

డిగ్రీలో ఆరుగురు డీబార్

కర్నూలు(అర్బన్), జూన్ 6: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3వ, 6వ సెమిస్టర్ పరీక్షల్లో ఆరుగురు విద్యార్థులు డీబార్ అయ్యారని పరీక్షల విభాగం కన్వీనరు డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కర్నూలు, నంద్యాల జిల్లాలోని 64 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు జరిగాయని తెలిపారు.

బెస్టు ఫీల్డు కానిస్టేబుల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సెబ్ కానిస్టేబుల్

కర్నూలు(అర్బన్), జూన్ 6: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో విభాగం బెస్టు ఫీల్డు స్టాఫ్ అవార్డుకు ఇంటలిజెన్స్ విభాగంలో కనిస్టేబుల్‌గా పనిచేస్తున్న సీ. విజయ్‌కుమార్ ఎంపికయ్యారని సూపరింటెండెంట్ ఎస్. రవికుమార్ తెలిపారు. గురువారం విజయవాడలోని కమిషన్ కార్యాలయంలో అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

మల్లన్న హుండీ ఆదాయం రూ.4,04,21,906 కోట్లు



శ్రీశైలం, జూన్ 6: శ్రీశైల మహాక్షేత్రంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లకు భక్తులు సమర్పించిన కానుకలను గురువారం లెక్కించారు. లెక్కింపులో ఆలయ హుండీల ద్వారా రూ.4,04,21,906 నగదు రూపంలో రాబడిగా లభించింది. ఆలయ హుండీ ఆదాయాన్ని భక్తులు 28 రోజుల్లో సమర్పించారు. నగదుతో పాటు 33.25 తులాల బంగారు 5.760 కిలోల వెండి లభించింది. అలాగే 1768 యు.ఎస్.ఏ డాలర్లు, 5 కెనడా డాలర్లు, ఒక ఖత్తార్ రియాల్, 55 ఆస్ట్రేలియా డాలర్లు, 50 యుకే పౌండ్స్ మొదలైన విదేశీ కరెన్సీ ఈ హుండీ లెక్కింపులో లభించాయి.

ప్రభుత్వ మార్పు.. అధికారుల్లో

వణుకు


ఇరిగేషన్ కార్యాలయం

- లాంగ్ లీవ్‌లో వెళ్లేందుకు ఇరిగేషన్ ఉన్నతాధికారుల ప్రయత్నాలు
- గత వైసీపీ ప్రభుత్వంలో నేతలతో అంటకాగిన అధికారుల్లో భయం
- రూ.1600 కోట్ల దాకా బిల్లులు రాబట్టేందుకు కాంట్రాక్టర్ల విశ్వ ప్రయత్నం
- బిల్లులపై ఎంక్వైరీకి ఆదేశిస్తారనే ఆందోళన

కర్నూలు(అగ్రికల్చర్), జూన్ 6: తెలుగుదేశం పార్టీ త్వరలో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న పరిస్థితుల్లో వివిధ ప్రభుత్వ శాఖల్లో పని చేస్తున్న ఉన్నతాధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పాటైతే.. తమపై ఎంక్వైరీలు జరుగుతాయనే భయం వారిలో మొదలైంది. ఏదో ఒక విధంగా ఈ గండం నుంచి తప్పించుకునేందు కోసం వారు ఇప్పటి నుంచే దారులు వెతుకుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. కీలకమైన నీటి పారుదల శాఖలో కొంత మంది ఉన్నతాధికారులు ఈ గండం నుంచి గట్టెక్కేందుకు దారులు వెతుక్కుంటున్నారు. కర్నూలు జిల్లాలో జలమండలి విభాగంలో పని చేస్తున్న ఉన్నతాధికారులు లాంగ్ లీవ్‌పై వెళ్లాలని నిర్ణయం తీసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఈ విభాగంలోని రాష్ట్ర అధికారుల అనుమతి పొందేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం అందింది. గత వైసీపీ ప్రభుత్వంలో ఈ శాఖలో పని చేస్తున్న కొంత మంది జిల్లా ఉన్నతాధికారులు అధికారపార్టీ కీలక నేతలతో అంటకాగి, వారి ఆదేశాల మేరకు పనులు చేయించి, నిబంధనలకు విరుద్ధంగా బిల్లులు చెల్లించారనే ఫిర్యాదులు వెలువెత్తుతున్నాయి. మైనర్ ఇరిగేషన్ పరిధిలోని పనులతో పాటు హంద్రీ నీవా కాలువ ద్వారా 70 చెరువులకు నీరు అందించే కార్యక్రమంలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నట్లు పెద్ద ఎత్తున ఫిర్యాదులు వినిపించాయి. ఈ బిల్లులు యుద్ధ ప్రాతిపదికన సంబంధిత కాంట్రాక్టర్లకు చెల్లించడంపై ప్రస్తుతం అధికారంలోకి రానున్న టీడీపీ పెద్దలకు కొంత మంది ఉప్పందించినట్లు తెలుస్తున్నది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో నాడు-నేడు కార్యక్రమం కింద పెద్ద ఎత్తున చెరువుల్లో పూడికతీత, కాలువల్లో మట్టి తొలగింపు, మరమ్మతుల పనులు తదితర ముఖ్యమైన వాటిని చేపట్టారు. ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకుండా వారిని ముప్పతిప్పలు పెట్టింది. బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పుల్లోళ్ల బాధలు పడలేక కొంత మంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ వ్యవహారంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు నీరు-చెట్టు కార్యక్రమం కింద పనులు చేసిన వారికి బిల్లులు చెల్లించాలని, లేకపోతే న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని వైసీపీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు బిల్లులు చెల్లించమని కోర్టు నుంచి ఉత్తర్వులు కూడా వచ్చాయి. ఏదో విధంగా ఈ బిల్లులను చెల్లించకుండా జాప్యం చేయాలనే కక్షతో వైసీపీ ప్రభుత్వం అప్పటికే పూర్తయిన పనులను క్షుణ్ణంగా పరిశీలించేందు కోసమని వివిధ ప్రభుత్వ విభాగాల్లోని ఇంజనీరింగ్ అధికారులతో ఎంక్వైరీ కోసం కమిటీలు వాశారు.

● లాంగ్ లీవ్‌పై వెళ్లేందుకు విశ్వప్రయత్నాలు:

కర్నూలు సీఈ కార్యాలయ పరిధిలో పోతిరెడ్డిపాడు విస్తరణతో పాటు అవుకు, గోరుకల్లు కాల్వల విస్తరణ, కుందూ వెడల్పు తదితర ప్రాజెక్టుల పనులు చేసిన కాంట్రాక్టర్లకు రూ.1600 కోట్ల దాకా చెల్లించాల్సి ఉందని నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. అదే విధంగా కర్నూలు జిల్లాలో మైనర్ ఇరిగేషన్ శాఖ పరిధిలో ఆర్డీఎస్ పనులు చేసిన వారికి రూ.10 కోట్లు, పత్తికొండ నియోజకవర్గంలో మైనర్ ఇరిగేషన్ పనులు చేసిన వారికి రూ.26 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ పనులు చేపట్టడంలో కాంట్రాక్టర్లు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, ఏ మాత్రం నాణ్యత పాటించలేదని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఇందులో భాగంగా వైసీపీ ప్రభుత్వంలో ఈ పనులు చేసిన కాంట్రాక్టర్లు బకాయి బిల్లులను వెంటనే చెల్లించాలని ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది. మరోవైపు ఈ బిల్లులు చెల్లిస్తే.. అధికారంలోకి రానున్న తెలుగుదేశం పార్టీ నేతల నుంచి ఆగ్రహావేశాలను చవిచూడాల్సి వస్తుందని, అందువల్లనే మధ్యే మార్గంగా విధుల నుంచి తాత్కాలిక విరామం తీసుకునేందుకు దీర్ఘకాలిక సెలవుల్లో వెళ్లేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టినట్లు కొంత మంది అధికారులు చెబుతున్నారు.

తీగల వంతెన నిర్మాణానికి కృషి చేస్తాం

- జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి
- రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత
- అరాచక శక్తులకు ఓటమి తప్పదు
- టీడీపీ సీనియర్ నాయకుడు బైరెడ్డి రాజశేఖరరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి

నంద్యాల (నూనెపల్లె), జూన్ 6: సిద్ధేశ్వరంపై నిర్మించే తీగల వంతెనతో పాటు బ్యారేజీ నిర్మాణానికి కృషి చేసేలా చర్యలు తీసుకుంటామని టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖరరెడ్డి అన్నారు. గురువారం నంద్యాలలోని టీడీపీ ఎంపీ కార్యాలయంలో ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో కనీవినీ ఎరుగని రీతిలో ప్రజలు టీడీపీ కూటమికి పట్టం కట్టడం ఆనందంగా ఉందన్నారు. నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థిగా బైరెడ్డి శబరిని 1,12,000 ఓట్లతో గెలిపించిన అన్ని వర్గాల ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. సిద్ధేశ్వరంపై తీగల వంతెనతో పాటు బ్యారేజీని నిర్మిస్తే జిల్లాలోని రైతులకు, ప్రజలకు తాగు, సాగు నీరు పుష్కలంగా లభిస్తుందని అన్నారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టుపై దృష్టి పెడతామన్నారు. 2019 ఎన్నికలలో నంద్యాల పార్లమెంట్‌లోని 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో గెలిచిన వైసీపీ నాయకులు ప్రజలకు సేవ చేయకుండా జిల్లాలోని సహజ వనరులను దోచేసి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. అరాచక పాలనతో ప్రజలను విసిగించారని దీంతో అరాచక శక్తులను చిత్తుగా ఓడించి ప్రజా సేవకులకు పట్టం కట్టారని అన్నారు. ప్రజలకు, రైతులకు నిత్యం అందుబాటులో ఉంటామని, వైసీపీ రౌడీ మూకల నుంచి రక్షణగా నిలుస్తామని అన్నారు. ఏదైనా సమస్య వస్తే ప్రజలు నేరుగా వచ్చి విన్నవించుకునేలా అందుబాటులో ఉంటామని ఆయన భరోసా కల్పించారు. భూకబ్జాలకు పాల్పడిన నాయకులపై విచారణ జరిపించి తగు చర్యలు చేపడతామన్నారు. అంతకు ముందు ఎంపీ కార్యాలయానికి చేరుకున్న బైరెడ్డికి టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు.

సిద్ధేశ్వరం అలుగు నిర్మించాలి


కరపత్రాలు విడుదల చేస్తున్న నాయకులు

నంద్యాల టౌన్, జూన్ 6 : రాయలసీమ కరువు పరిష్కారానికి, శ్రీశైలం ప్రాజెక్టు జీవితకాలం పెరగడానికి సిద్ధేశ్వర అలుగు నిర్మించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి తెలిపారు. గురువారం నంద్యాలలోని సాగునీటి సాధన సమితి కార్యాలయంలో ఈ నెల 10వ తేదీన నిర్వహించబోతున్న సిద్ధేశ్వరం అలుగు 8వ వార్షికోత్సవ ప్రచార కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ విభజన చట్టంలో రాయలసీమ అభివృద్ధికి ఎన్నో హక్కులు కల్పించినప్పటికీ వాటిని అమలుపరచకుండా ఈ పదేళ్లలో పాలకులు అన్యాయం చేశారని అన్నారు. రాయలసీమకు ద్రోహం జరుగుతున్న నేపథ్యంలో వేలాది మంది రైతులు కదిలి వచ్చి 2016, మే 31న ప్రజా సంఘాల నేతృత్వంలో సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన చేశారని అన్నారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ప్రధాన రాజకీయ పార్టీలు రాయలసీమ అంశాలను తమ తమ మేనిఫెస్టోలో ప్రకటించాయని, కానీ పాలకులు గత పదేళ్లుగా ప్రకటనలతో సరిపెట్టుకున్నారని, రాయలసీమను మోసం చేస్తున్నారని అన్నారు. సిద్ధేశ్వరం అలుగు శంకుస్థాపన 8వ వార్షికోత్సవాన్ని ఈ నెల 10న సిద్ధేశ్వరం వద్ద పెద్దఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులు, రైతు సంఘాలు, యువత, మేధావులు, అన్ని వర్గాల ప్రజలు వార్షికోత్సవానికి హాజరై రాయలసీమ ఉజ్వల భవిష్యత్తుకు పాలకులపై ఒత్తిడి పెంచే కార్యక్రమంలో పాల్గొనాలని దశరథరామిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సాగునీటి సాధన సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కేసుల్లో గైనిక్ విభాగం ముందంజ

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ సి. ప్రభాకర్ రెడ్డి


మాట్లాడుతున్న ఆసుపత్రి సూపరింటెండెంట్

కర్నూలు(హాస్పిటల్), జూన్ 6: ఆరోగ్యశ్రీ కేసులు నమోదులో గైనిక్ విభాగం అందరికంటే ప్రథమ స్థానంలో ఉందని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. గురువారం ఆసుపత్రి ధన్వంతరీ హాలులో ఆరోగ్యశ్రీ డేటా ఎంట్రీ ఆపరేటర్లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సి.ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రిలోని పలు విభాగాల్లో టార్గెట్ ప్రతి నెలా 500 కేసులకు మించి చేయాలని లక్ష్యాన్ని పూర్తి చేసిన వారికి బోనస్ ప్రకటిస్తామన్నారు. మే నెలలో ఆరోగ్యశ్రీ కేసుల్లో గైనిక్ విభాగం 666 కేసులు, జనరల్ మెడిసిన్ 438, సర్జరీ విభాగం 325 కేసులు చేసి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఉన్నాయన్నారు. అలాగే న్యూరాలజీలో 142 ఐసీయూ కేసులు ఆపరేటివ్ చేసిన డేటా ఎంట్రీ ఆపరేటర్‌ను సూపరింటెండెంట్ అభినందించారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను బయటకు పంపించకుండా ఆరోగ్యశ్రీ ద్వారా హాస్పిటల్‌లో రిజిస్టర్ అయ్యేలాగా చూడాలన్నారు. ఏ ఒక్క కేసు కూడా బయటకు పంపకూడదని అలా చేస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. ఇకపై ఆరోగ్యశ్రీలో ప్రతి వారం సమీక్ష ఉంటుందన్నారు. ఈ సమీక్షలో సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంవో డాక్టర్ హేమనళిని, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ శివబాల, డాక్టర్ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్‌గా వెంకటరమణ



కర్నూలు(హాస్పిటల్), జూన్ 6: ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా డాక్టర్ టీసీహెచ్ వెంకటరమణను నియమిస్తూ కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. సివిల్ అసిస్టెంట్ సర్జన్‌గా ఉన్న వెంకటరమణ ఏఆర్ఎంవోగా, ఎంఎన్‌వోల బాధ్యతలను నిర్వహిస్తున్నారు. వీటితో పాటు ఆరోగ్యశ్రీ ర్యాంకోగా బాధ్యతలు చూసుకుంటున్నారు. సూపరింటెండెంట్ ఆదేశాలతో కొత్తగా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్‌గా రోజువారి కేసులు, నివేదికలు వాటి వివరాలను నిర్వహించనున్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరి మృతి

- బనగానపల్లెలో ఒకరు, బేతంచెర్లలో మరొకరు


పాండురంగ (ఫైల్)


మృతి చెందిన గాజుల ఈశ్వరమ్మ

బనగానపల్లె, జూన్ 6: జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో గురువారం జరిగిన విద్యుదాఘాతంతో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. బనగానపల్లెలో పాండురంగ అనే వ్యక్తి మృతి చెందగా బేతంచెర్లలో ఈశ్వరమ్మ అనే మహిళ మృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా... మండలంలోని పలుకూరు గ్రామానికి చెందిన సంగు వెంకటేశ్వర్లు కుమారుడు సంగు పాండురంగ (32) అనే గని కార్మికుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. ఉదయం పలుకూరు సమీపంలోని గనిలో విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా పాండురంగ విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పాండురంగ మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు నందివర్గం ఎస్ఐ తిరుపాలు తెలిపారు. మృతుడికి భార్య శిరీష, ఇద్దరు పిల్లలు సంతానం. పాండురంగ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బేతంచెర్ల: పట్టణంలో రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో నివాసం ఉంటున్న గాజుల ఈశ్వరమ్మ ఇంట్లో కరెంట్ స్విచ్ వేసేందుకు వెళ్లి విద్యుదాఘాతానికి గురైంది. గోరుమానుకొండ గ్రామానికి చెందిన సమరసత సేవా ఫౌండేషన్ మండల ధర్మప్రచారక్ బాలేశ్వరరెడ్డి, ఈశ్వరమ్మ దంపతులు బేతంచెర్లలో నివాసం ఉంటున్నారు. ఇంట్లో పనులు చేసుకుంటూ తడిచేత్తోనే కరెంటు స్విచ్ ఆన్ చేయగానే ఈశ్వరమ్మకు విద్యుత్ షాక్ తగిలి కుప్పకూలిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను బేతంచెర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కొద్దిసేపటికే చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. మృతురాలికి భర్త, కుమారుడు, కుమార్తెలు ఉన్నారు.

కారు, మోటార్ సైకిల్ ఢీ : యువకుడి మృతి

- ఒకరికి గాయాలు


మృతి చెందిన ముల్లా మెహది హసన్

బనగానపల్లె రూరల్, జూన్ 6 : మండల పరిధిలోని యనకండ్ల గ్రామం వద్ద కారు - మోటార్ సైకిల్ ఢీకొన్న సంఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. మరొకరికి గాయాలయ్యాయి. బనగానపల్లె పట్టణం కొండపేటకు చెందిన ముల్లా మెహదీ హసన్, షేక్ మస్తాన్ బేతంచెర్ల పట్టణంలోని కూల్ డ్రింక్ షాప్‌లో పని చేస్తున్నారు. ప్రతి రోజూ ఉదయం బనగానపల్లె నుంచి బేతంచెర్ల వెళ్లి రాత్రి ఇంటికి తిరిగి వచ్చేవారు. బుధవారం రాత్రి బేతంచెర్ల నుంచి బనగానపల్లెకు మోటార్ సైకిల్‌పై ఈ యువకులు వస్తున్నారు. 10:30 గంటల సమయంలో బనగానపల్లె నుంచి పలుకూరు వెళుతున్న కారు యనకండ్ల గ్రామం వద్ద వీరి మోటార్ సైకిల్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో ముల్లా మెహది హసన్ (20) అక్కడికక్కడే మృతి చెందాడు. షేక్ మస్తాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బనగానపల్లె పోలీసులు తెలిపారు.

పద్మ అవార్డుల దరఖాస్తులకు ఆహ్వానం

కర్నూలు(స్పోర్ట్స్), జూన్ 6: భారత ప్రభుత్వం 2025 సంవత్సంలో ప్రదానం చేసే పద్మ, పద్మ విభూషణ్, పద్మ భూషణ్, పద్మశ్రీ అవార్డుల పురస్కారాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొని పతకాలు సాధించిన వారు అర్హులన్నారు. క్రీడాకారులు తమ దరఖాస్తులను ఏపీ రాష్ట్రక్రీడా ప్రాధికార సంస్థ, విజయవాడ మెయిల్ అడ్రస్ sportsnap@gmail.com (or) incentives.schemes@ gmail.comకు ఆగస్టు ఒకటోతేదీ సాయంత్రం 5 గంటల్లోగా పంపాలన్నారు.

ఎమ్మెల్యేలకు అభినందనల వెల్లువ

● టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడిన పార్టీ కార్యాలయాలు, ఎమ్మెల్యేల నివాసాలు ● ఆనందంలో పార్టీ శ్రేణులు

నిత్యం జనంతోనే ఉంటా: ఎమ్మెల్యే జయసూర్య



నందికొట్కూరు, జూన్ 6: ప్రజలకు నిత్యం అందుబాటులో వారి వారికి తలెత్తే సమస్యకు పరిష్కారం చూపుతానని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ముందుగా నందికొట్కూరులో 20 ఏళ్ల తర్వాత టీడీపీ విజయకేతనం ఎగురవేయడంలో దోహదపడిన నియోజకవర్గంలోని ప్రజలకు, ఎమ్మెల్యేగా అవకాశం కల్పించిన నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి మాండ్ర ఉమాదేవికి జీవితాంతం రుణపడి ఉంటానన్నారు. నియోజకవర్గంలో టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న ఐదేళ్ల ప్రజల్లోనే ఉంటూ ఇదేమి ఖర్మ, బాదుడే బాదుడు, బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ, శంఖారావం వంటి కార్యక్రమాలతో ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలను తెలుసుకుంటూ వారికి అండగా నిలిచామన్నారు. అంతే కాకుండా నారా లోకేశ్ పాదయాత్ర సమయంలో మాండ్ర శివానందరెడ్డి మిడ్తూరు ఎత్తిపోతల పథకాన్ని నిర్మిస్తామని చెప్పడంతో మిడ్తూరు మండలంలో కలిసి వచ్చిందన్నారు. అలాగే పట్టణంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం, కేజీ రోడ్డు విస్తరణ, నియోజకవర్గానికి కంపెనీలను తీసుకొస్తామన్న హామీలతో పాటు సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. టీడీపీ హయాంలో నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిని, వైసీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని ప్రజలు బేరీజు వేసుకొని టీడీపీకి మద్దతు తెలిపారన్నారు. వీటన్నింటికి తోడు స్థానికేతరుడిని వైసీపీ ఎమ్మెల్యేగా తీసుకురావడం, స్థానిక నాయకుల నియంత పోకడతో పట్టణ ప్రజలు విసుగు చెందడంతో టీడీపీ వైపు ప్రజలు ఆకర్షితులయ్యారన్నారు. నియోజకవర్గంలో ప్రతి ఒక్క సామాజిక వర్గానికి చెందిన ప్రజలతో బంధాలు, స్నేహం తనకు కలిసి వచ్చాయన్నారు. ఇలా ప్రతి అంశం తన గెలుపుకు కలిసి వచ్చాయని జయసూర్య అన్నారు. నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చేందుకు తన వంతు కృషి చేస్తానని ఆయన అన్నారు.

'ఉద్యోగుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి'



మాట్లాడుతున్న సుధాకర్

నంద్యాల (నూనెపల్లె), జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో అసాధారణ విజయం సాధించిన కూటమి ఉద్యోగ ఉపాధ్యాయ సంక్షేమానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఎస్టీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ కోరారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. చంద్రబాబు ఆధ్వర్యంలో ఏర్పడనున్న రాష్ట్ర ప్రభుత్వం పాఠశాల విద్య, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యకు తీవ్ర నష్టం కలిగించే జీవో 117ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా వ్యవస్థను కాపాడాలని కోరారు. మెగా డీఎస్సీతో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ, ప్రతి పాఠశాలలో ఇంగ్లీష్ మీడియంతో పాటు తెలుగు మాధ్యమాన్ని సమాంతరంగా కొనసాగించాలని కోరారు. గత ప్రభుత్వ ఉద్యోగ ఉపాధ్యాయులపై కక్ష పూరిత ధోరణితో పెట్టిన కేసులను, సస్పెన్షన్‌లను ఎత్తి వేయాలన్నారు. కార్యక్రమంలో మాత్యనాయక్, నాగరాజు, రాము, తదితరులు పాల్గొన్నారు.

అభయాంజనేయ స్వామికి పూజలు



ఏకశిలా అభయాంజనేయస్వామి విగ్రహం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

బండిఆత్మకూరు, జూన్ 6: మండలంలోని పెద్ద దేవళాపురం గ్రామ శివారులో వెలసిన ఏకశిలా అభయాంజనేయస్వామికి పెద్ద ఎత్తున భక్తులు పూజలు నిర్వహించారు. గురువారం అమావాస్య సందర్భంగా నిర్వాహకులు శివరాజునాయక్, నాగేశ్వరరావు నాయక్ ఆధ్వర్యంలో తెల్లవారు జామునే స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, ఆకుపూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకుని కాయ, కర్పూరాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. స్వామి వారికి ప్రదక్షిణలు చేశారు. భక్తులకు నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందజేసి, అన్నదానం చేశారు. కార్యక్రమంలో తేజనాయక్, శివనాయక్, శివన్న, వెంకటరమణనాయక్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

కొలను భారతి క్షేత్రానికి భక్తుల తాకిడి



పూజలు చేస్తున్న భక్తులు

కొత్తపల్లి, జూన్ 6: మండలంలోని కొలనుభారతి అమ్మవారి క్షేత్రంలో భక్తజన సందడి నెలకొంది. వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో గురువారం ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగస్థులతో పాటు విద్యార్థులకు కూడా సెలవులు ముగుస్తుండటంతో తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి సరస్వతి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తల్లిదండ్రులు వారి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించుకున్నట్లు తెలిపారు. భక్తులకు ఆర్యవైశ్య నిర్వహకులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.



పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితకు పుష్పగుచ్ఛం అందిస్తున్న నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య



వేల్పనూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా దంపతులు



ఎమ్మెల్యే ఫరూక్, సోమిశెట్టిని సన్మానిస్తున్న ఆర్యవైశ్యులు

నంద్యాల కల్చరల్, జూన్ 6: నంద్యాలలో టీడీపీ గెలుపుతో అభిమానులు ఆనందంలో మునిగి తేలుతున్నారు. నంద్యాల ఖలీల్ థియేటర్ ప్రాంతంలోని టీడీపీ కార్యాలయంలో ఆయుష్ యోగా నిర్వాహకులు ఆనంద్ గురూజీ, యోగా సభ్యులు, నంద్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు భవనాశి నాగమహేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు నంద్యాల టీడీపీ ఎమ్మెల్యే ఎన్‌ఎండీ ఫరూక్‌ను కలిశారు. ఆయనకు శాలువా కప్పి, పూలమాలవేసి మెమెంటో ఇచ్చి స్వీట్ తినిపించుకున్నారు. స్వీట్లు ఒకరికొకరు తినిపించుకొని ఆనందాలు వ్యక్తం చేశారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నంద్యాల (నూనెపల్లె): అధికార వైసీపీని తరిమి కొట్టి ప్రజలు కూటమికి భారీ విజయాన్ని అందించారని, ఈ విజయంతో తనకు మరింత బాధ్యత పెరిగిందని నంద్యాల ఎమ్మెల్యే ఎన్‌ఎండీ ఫరూక్ అన్నారు. గురువారం టీడీపీ సీనియర్ నాయకులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు టీడీపీ కార్యాలయానికి చేరుకుని ఎన్‌ఎండీ ఫరూక్‌ను అభినందించి సన్మానించారు. ఫరూక్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ ప్రజలు తనను గెలిపించడంపై కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని, ఇచ్చిన హామీలను నెరవేరుస్తారని అన్నారు. సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఒక్కసారి అధికారం ఇచ్చాక ఏం చేసినా భరిస్తారన్న తరహాలో వైసీపీ పోకడలు సాగాయని, అయితే ప్రజలు పాతాళానికి తొక్కి పడేశారని అన్నారు. చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధిలో దూసుకుపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమాలలో ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

● ఎమ్మెల్యేగా ఎన్‌ఎండీ ఫరూక్ విజయం సాధించడంతో గురువారం టీడీపీ కార్యాలయంలో వేద పండితులు ఆయనను కలసి వేదాశీర్వచనాలు అందించారు. నూతనంగా కొలువు తీరే కూటమి ప్రభుత్వంలో మరిన్ని పదవులు తీసుకుని ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షించారు. ప్రథమ నంది దేవస్థానం ప్రధాన అర్చకులు ప్రవీణ్ బృందం అభినందనలు తెలిపింది.

ఆత్మకూరు: శ్రీశైలం అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖరరెడ్డి విజయం సాధించడంతో గురువారం ఆత్మకూరు పట్టణంలోని రఘునాథ్ సెంటర్‌లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెండు దశాబ్దాల తర్వాత శ్రీశైల నియోజకవర్గంలో టీడీపీ జెండా ఎగురవేయడం సంతోషంగా ఉందని అన్నారు. తమ నాయకుడు బుడ్డా గెలుపుతోనే నియోజకవర్గం అభివృద్ధి సాధ్యమని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు శివప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, కలీముల్లా, నూర్ బేగ్, గౌస్‌లాజం, నూర్, మొహబతుల్లా, గౌస్‌ఆజం, షాలుపైల్వాన్, షఫీ, షఫీవుల్లా, రఫీక్, కొయ్య హోటల్ మున్నా, షాబుద్దీన్, పస్పిల్ మున్నా తదితరులు ఉన్నారు.

వెలుగోడు: శ్రీశైలం ఎమ్మెల్యేగా విజయం సాధించిన బుడ్డా రాజశేఖరరెడ్డి, ఆయన సతీమణి శైలజ గురువారం వేల్పనూరులోని అంకాల పరమేశ్వరి దేవి ఆలయంలో కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించారు. బుడ్డా మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో తన గెలుపుకు కృషి చేసిన నాయకులకు, కార్యకర్తలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానన్నారు.

● రాష్ట్రంలో అదుపు తప్పిన పాలనను గాడిలో పెట్టి అభివృద్ధి చేయాలంటే ఒక్క టీడీపీ తోనే సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. వైసీపీ పాలనతో విసుగు చెంది ప్రజలు తమ ఓటు హక్కుతో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పారన్నారు. శ్రీశైలం నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యేగా బుడ్డా రాజశేఖరరెడ్డిని గెలిపించడం పట్ల ఈ సందర్భంగా ప్రతి ఓటరుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే ఆర్యవైశ్య ప్రముఖులు రాము, సంజీవరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారిలోని ప్రతి దుకాణాలలో మిఠాయిలు పంచి పెట్టారు. అలాగే టీడీపీ విజయానికి పాటు పడిన టీడీపీ మండల నాయకులు అన్నారపు శేషిరెడ్డి, అబ్దుల్‌కలాం, ఖలీల్, మోమిన్ రసూల్, మాలిక్,మండ్ల శంకరరెడ్డి, పాల శంకరరెడ్డిని టీడీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ హుసేన్, ముర్తుజా ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాలలో రవికుమార్, జనార్దన్, సుబ్రహ్మణ్యం, రాజు, మల్లి, బంకు శీను, నాగేశ్వరరావు,మల్లి, బాలు చంద్ర, తదితరులుపాల్గొన్నారు.

గడివేముల: సార్వత్రిక ఎన్నికల్లో పాణ్యం ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో గౌరుచరిత గెలుపొందడంతో గురువారం మండలంలోని బూజనూరు, తిరుపాడు, గడిగరేవుల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపాడు గ్రామానికి చెందిన మురళీధర్‌రెడ్డి, పాణ్యం నియోజకవర్గ ఐటీడీపీ ఉపాధ్యక్షుడు బీవీఎన్ రాజు, తిరుపాడు జనసేన నేతలు మండలంలోని గడిగరేవుల గ్రామ శివారులో వెలసిన దుర్గాభోగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మండలంలో టీడీపీ భారీ మెజార్టీ సాధించడంతో టీడీపీ మండల అధ్యక్షుడు దేశం సత్యనారాయణరెడ్డిని కలిసి కేక్ కట్ చేశారు. బూజనూరు గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు దిలిప్‌కుమార్‌రెడ్డి, వంశీధర్‌రెడ్డి, మద్దిలేటిరెడ్డి ఎమ్మెల్యే గౌరుచరితకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నందికొట్కూరు: పాణ్యం ఎమ్మెల్యేగా గెలిచిన గౌరు చరితారెడ్డికి నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య గురువారం కర్నూలులో శుభాకాంక్షలు తెలిపారు. గురువారం కర్నూలులోని గౌరు చరితారెడ్డి నివాసంలో ఆమెను జయసూర్యతో పాటు టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి, ఆయన సతీమణి ఉమాదేవి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. గౌరు చరితారెడ్డి కూడా నందికొట్కూరు ఎమ్మెల్యేగా ఎన్నికైన గిత్తా జయసూర్యకు శుభాకాంక్షలు తెలిపి అభినందించారు. నందికొట్కూరు నియోజకవర్గ ఇన్‌చార్జి గౌరు వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే ఫరూక్‌ను సన్మానిస్తున్న యోగా సభ్యులు



ఎమ్మెల్యే ఫరూక్‌కు జ్ఞాపిక అందజేత



ఆత్మకూరులో ఆనందం వ్యక్తం చేస్తున్న నాయకులు



ఎమ్మెల్యే గౌరుచరితకు శుభాకాంక్షలు తెలుపుతున్న తిరుపాడు నాయకులు



ఫరూక్‌ను కలిసిన వేద పండితులు



వెలుగోడులో మిఠాయిలు పంచుతున్న ఆర్యవైశ్యులు

కోతకు గురైన జాతీయ రహదారి



నాగలూటి క్రాస్ కోతకు గురైన జాతీయ రహదారి

నందికొట్కూరు, జూన్ 6: 360-సి రహదారి పనుల్లో డొల్లతనం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. బుధవారం రాత్రి కురిసిన వర్షాలకు 360-సి జాతీయ రహదారి కోతకు గురైంది. మిడ్తూరు మండలం నాగలూటి క్రాస్ వద్ద కర్నూలు వెళ్లే మార్గంలో వంతెన వద్ద రహదారి కోతకు గురైంది. భారీగా వర్షాలు కురవడంతో వంతెన సమీపంలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో రహదారి కోతకు గురై దెబ్బతింది. అలాగే ఈనెల 2వ తేదీ రాత్రి కురిసిన వర్షానికి కూడా నందికొట్కూరు మండలం బ్రాహ్మణకొట్కూరు, కర్నూలు మండలం గార్గేయపురం మధ్యలో బ్రిడ్జి వద్ద రోడ్డు కోతకు గురైంది. రోడ్డు నిర్మాణం పనుల్లో ప్రమాణాలు పాటించడం లేదన్న ఆరోపణలకు ఈ రహదారి కోతలు నిదర్శనంగా నిలుస్తున్నాయి.



ఇటీవల కురిసిన వర్షాలకు బ్రాహ్మణకొట్కూరు, గార్గేయపురం వద్ద కుంగిపోయిన జాతీయ రహదారి

27న కార్యవర్గ సమావేశం


నంద్యాల (నూనెపల్లె), జూన్ 6: కర్నూలు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ సమావేశం ఈనెల 27న నంద్యాలలోని గుడ్ షెపర్డ్ పాఠశాలలో కార్యవర్గ సమావేశం, నూతన ఎన్నికల ప్రక్రియ ఉంటుందని నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీరామ మూర్తి , బాల మద్దిలేటి తెలిపారు. 2024-29 పదవీ కాలానికి నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకోనున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని అసోషియేషన్ సభ్యులు కమిటీ ప్రతినిధులు, సీనియర్ బ్యాడ్మింటన్ అభిమానులు సమావేశానికి హాజరు కావాలని తెలిపారు.

ముగిసిన ఎన్నికల కోడ్

ఆత్మకూరు, జూన్ 6: దేశవ్యాప్తంగా జరిగిన సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఎన్నికల కోడ్ గురువారంతో ముగిసింది. దేశంలో మొత్తం 7 విడతల్లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో ఈ ఎన్నికలకు సంబంధించి మార్చి 16వ తేదిన కేంద్ర ఎన్నికల కమిషన్ షెడ్యూల్ విడుదల చేయడంతో అప్పటి నుంచే ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ఈక్రమంలోనే ఏపీలో ఏప్రిల్ 18వ నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవ్వగా మే 13వ తేదిన సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. జూన్ 4వ తేదిన ఎన్నికలు ఫలితాల ప్రక్రియ ప్రశాంతంగా పూర్తవ్వడంతో 6వ తేది వరకు ప్రకటించిన ఎన్నికల కోడ్ ముగిసింది.

నందికొట్కూరులో టీడీపీ నిశ్శబ్ద విజయం

● కొత్తపల్లి మినహా మిగిలిన ఐదు మండలాల్లో టీడీపీ మెజార్టీ



నందికొట్కూరు, జూన్ 6: నందికొట్కూరులో టీడీపీ నిశ్శబ్ద విజయాన్ని సొంతం చేసుకుంది. వైసీపీ స్థానికేతరుడైన ధార సుధీర్‌కు టిక్కెట్ కేటాయించడం, ఆయన నియోజకవర్గానికి వచ్చి రాగానే ఒక సామాజిక వర్గానికి మద్దతుగా మాట్లాడడంతో మరో సామాజిక వర్గం ఏకమైంది. ఒక్కసారి స్థానికేతరుడిని గెలిపిస్తే.... ఇక ఇదే ఆనవాయితీ అవుతుందన్న ఆలోచనతో వైసీపీకి బలంగా ఉన్నా మాల సామాజికవర్గం కూడా టీడీపీ వైపు మొగ్గు చూపింది. దీంతో వైసీపీకి కంచుకోటగా ఉన్న నందికొట్కూరులో ఆ పార్టీకి పరాభవం తప్పలేదు. నందికొట్కూరు అంటే వైసీపీకి అడ్డా అనుకున్న జగన్ కోటకు బీటలు వారేలా చేశారు. మాండ్ర శివానందరెడ్డి తమదైన శైలిలో వ్యూహ ప్రతివ్యూహాలు రచిస్తూ వైసీపీ హ్యాట్రిక్ విజయానికి దెబ్బకొట్టారు. 2019 ఎన్నికల్లో నందికొట్కూరు నియోజకవర్గ చరిత్రలోనే 40,863 ఓట్ల అత్యధిక మెజార్టీని వైసీపీ నమోదు చేసింది. అయితే ఈసారి అతిసామాన్యుడైన గిత్తా జయసూర్యను గెలిపించి నవనందుల కోటలో టీడీపీ జెండాను ఎగురవేసిన ఘనత మాండ్ర శివానందరెడ్డికే దక్కుతుంది. 2019 ఎన్నికల్లో జగన్ ప్రభంజనలో వైసీపీ గెలిస్తే... ఈ సారి కూడా వైసీపీకే విజయం తథ్యమని అన్ని సర్వేలు చెప్పాయి. అయితే టీడీపీ నాయకుడు మాండ్ర శివానందరెడ్డి, గిత్తా జయసూర్య అంతర్గత వ్యూహాలు, ప్రణాళికలతో సర్వేలకే ఊహకందని నిశబ్ద విజయాన్ని టీడీపీ కైవసం చేసుకుంది.

ఐదు మండలాల్లో టీడీపీ ఆధిక్యం:

నందికొట్కూరు నియోజకవర్గంలో 1,86,763 ఓట్లు పోల్‌కాగా అందులో టీడీపీకి 92,004, వైసీపీకి 82,212, కాంగ్రెస్‌కు 7,949, ఇతరులకు 3,367, నోటాకు 1,237 ఓట్లు వచ్చాయి. ఇందులో నియోజకవర్గంలో పగిడ్యాల, జూపాడుబంగ్లా, మిడ్తూరు, నందికొట్కూరు, పాములపాడు మండలాల్లో టీడీపీ మెజార్టీ రాగా, కేవలం ఒక్క కొత్తపల్లి మండలంలోనే వైసీపీ ఆధిపత్యం చూపించింది. టీడీపీకి పాములపాడులో 981 మెజార్టీ, నందికొట్కూరులో 5,405 మెజార్టీ రాగా, పగిడ్యాలలో 2,137, మిడ్తూరు 718, జూపాడుబంగ్లా 1,414 మెజార్టీ రాగా, వైసీపీకి ఒకే ఒక్క మండలం కొత్తపల్లిలో 1,386 మెజార్టీ వచ్చింది.

వివిధ పార్టీలకు వచ్చిన ఓట్లు

మండలం	పోలైన ఓట్లు	టీడీపీ	వైసీపీ	మెజార్టీ	నోటా	ఇతరులు
పగిడ్యాల	22,979	11,857	9,720	2,137	208	1,194
నందికొట్కూరు	55,511	28,101	22,696	5,405	339	4,375
మిడ్తూరు	30,528	14,606	13,888	718	243	1,791
జూపాడుబంగ్లా	25,985	12,907	11,493	1,414	156	1,429
పాములపాడు	28,452	13,876	12,895	981	186	1,495
కొత్తపల్లి	21,437	9,457	10,843	1,386(వై)	105	1,032
పోస్టల్ బ్యాలెట్	1,877	1200	677	523	---	---
మొత్తం	1,86,763	92,004	82,212	9,792	1,237	11,316

అసంపూర్తిగా రోడ్డు



నీటి కుంటలను తలపిస్తున్న అసంపూర్తిగా ఉన్న రోడ్డు

నంద్యాల రూరల్, జూన్ 6: మండలంలోని పుసులూరు గ్రామంలో రోడ్డు అసంపూర్తిగా ఉండడంతో గ్రామస్థులు, వాహనదారులను తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వైసీపీ పాలనలో బీటీ రోడ్డు మంజూరైంది, సంబంధిత కాంట్రాక్టర్ సగం రోడ్డు మాత్రమే వేసి మిగిలిన సగం రోడ్డును వదిలేశారు. వర్షాకాలం కావడంతో రోడ్డు నీటికుంటను తలపిస్తూ ప్రయాణికులు, గ్రామస్తుల రాక పోకలకు చుక్కలు చూపిస్తోంది. రోడ్డు పూర్తి కానందున రాక పోకలను పొలాల్లోకి మరలించారు. పొలాల్లో రాకపోకలు ముందుకు సాగక వాహనదారుల యాతన వర్ణనాతీతం. తక్షణమే అధికారులు జోక్యం చేసుకుని అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువును తలపిస్తున్న ఆసుపత్రి ఆవరణ



ఆసుపత్రి ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

నందికొట్కూరు, జూన్ 6: నందికొట్కూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో వర్షపు నీరు చేరడం వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం రాత్రి కురిసిన వర్షానికి ఆసుపత్రి ప్రాంగణంలో నీరు నిలిచిపోయింది. వీపనగండ్ల వాగు వర్షపు నీరు ఉప్పొంగి ఎగువ భాగంలో ఉన్నటువంటి పొలాల్లో చేరి, దిగువ భాగంలో ఉన్నటువంటి హాస్పిటల్‌లో చేరడంతో చెరువును తలపిస్తోంది. ఓ మోస్తరు వర్షం కురిసినా ఆసుపత్రి ఆవరణ అంతా వర్షపు నీరు చేరుకుంటుంది. వర్షం కురిసిన ప్రతిసారి ఇలాంటి పరిస్థితులు తలెత్తడంతో రోగులు అవస్థలకు గురవుతున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రోగులు కోరుతున్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

దర్గాలో ఫాతేహాలు



పెద్దవంగలి దస్తగిరి స్వామి దర్గా వద్ద ఫాతేహాలు చేస్తున్న టీడీపీ నాయకులు

చాగలమర్రి, జూన్ 6: ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా అఖిలప్రియ విజయం సాధించడంతో మండలంలోని ముత్యాలపాడు, పెద్దవంగలికి చెందిన టీడీపీ నాయకులు గురువారం గ్రామంలోని దస్తగిరిస్వామి దర్గా వద్ద ఫాతేహాలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అలాగే జమ్మలమడుగులోని గైబుసా పహాడ్, ఓబుళంపల్లె, యాదవాడ గ్రామా ల్లోని దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నాయకులు డీఎం బాషా, మస్తాన్, సింహాద్రి, షరీఫ్, మహమ్మద్, ఓబయ్య, రమణారెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మొక్కులు తీర్చుకున్న టీడీపీ నాయకులు



ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్న టీడీపీ నాయకులు

డోన్(రూరల్), జూన్ 6: రాష్ట్రంలో వెలువడిన ఫలితాల్లో టీడీపీ విజయభేరీ మోగించడంతో పార్టీ అభిమానులు, నాయకులు ఆయా దేవాలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకు న్నా రు. గురువారం మండలంలోని వెంకటనాయునిపల్లె గ్రామంలో టీడీపీ సర్పంచ్ సీలం చంద్రశేఖర్ నాయుడు, సీనియర్ నాయకులు సీలం భాస్కర్ నాయుడు, టీడీపీ మండల కార్యదర్శి వెంకటనాయునిపల్లె శ్రీను ఆధ్వర్యంలో టీడీపీ అభిమానులు, కార్యకర్తలు ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేశారు. అనంతరం 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

చంద్రపల్లిలో టీడీపీ సంబరాలు

ప్యాపిలి, జూన్ 6: టీడీపీ అధికారంలోకి రావడంతో టీడీపీ శ్రేణులు విజయోత్సవ ర్యాలీలు, ఆలయాల్లో పూజలు, అభిషేకాలు నిర్వహిస్తున్నారు. గురువారం మండలంలోని చంద్రపల్లి గ్రామంలో టీడీపీ నాయకుడు వై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అలాగే నల్లమేకలపల్లి, కలచట్ల, ఏనుగమర్రి తదితర గ్రామాల్లో కూడా విజయోత్సవ ర్యాలీలు నిర్వహించారు.

వైసీపీని ఛీకొట్టిన ఓటర్లు: చల్లా



చల్లా విజయ్‌భాస్కర్ రెడ్డిని అభినందిస్తున్న బత్తిన మద్దిలేటి గౌడ్

అవుకు, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు వైసీపీని ఛీకొట్టారని టీడీపీ కార్యదర్శి చల్లా విజయ్ భాస్కర్ రెడ్డి గురువారం అన్నారు. అవుకు పట్టణ టీడీపీ నాయకుడు బత్తిన మద్దిలేటి గౌడ్, సుంకేసుల టీడీపీ నాయకులు కైప చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి చల్లా విజయ్‌భాస్కర్ రెడ్డికి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా చల్లా విజయ్ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్ రెడ్డి గెలుపొం దడం శుభపరిణామం అన్నారు. వైసీపీ అరాచక పాలనలో ప్రజలు విసుగెత్తిపోయారన్నారు. వైసీపీని గాలికి వదిలేసి మంత్రులు, ఎమ్మెల్యేలు సంపాదనే ధ్యేయంగా రాష్ట్రాన్ని దోచుకున్నారని విమర్శించారు. ఎన్నికల్లో ప్రజలు ఓటుతో వైసీపీకి బుద్ధి చెప్పి ఇంటికి సాగనపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

కోవెలకుంట్ల మండలంలో టీడీపీ ప్రభంజనం

కోవెలకుంట్ల, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో కోవెలకుంట్ల మండలంలో టీడీపీ ప్రభంజనం సృష్టించింది. ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డికి కోవెలకుంట్ల మండలం ప్రజలు అండగా నిలిచి భారీ మెజార్టీ ఇచ్చారు. మండలంలో నాయకులు వైసీపీ వైపు ఉండగా ప్రజలు టీడీపీ వైపు ఉన్నారు. మండలంలో మొత్తం 19 గ్రామాలు ఉండగా ఇందులో 16 గ్రామాల్లో టీడీపీకి మొత్తం 4,965 ఓట్లు వచ్చాయి. కోవెలకుంట్ల పట్టణంలో మొత్తం 21 బూత్‌లు ఉండగా ఇందులో కేవలం ఒక బూత్ మాత్రమే వైసీపీ మెజార్టీ రాగా మిగతా 20 బూత్‌లలో 3,172 ఓట్లు వచ్చాయి. అమడాలలో టీడీపీకి 223, సొదరదిన్నెలో టీడీపీకి 85 ఓట్లు, బిజనవేములలో 146 ఓట్లు, పెద్దకొప్పెర్ల 121 ఓట్లు, ఎం గోవిందిన్నె 50 ఓట్లు, వల్లంపాడులో 108 ఓట్లు, లింగాలలో 29, రేవనూరులో 136 ఓట్లు, , ఎం. ఉప్పలూరులో 5 ఓట్లు, కలుగొట్లలో 352 ఓట్లు, భీమునిపాడులో 30 ఓట్లు, కంపమల్లలో 165 ఓట్లు, పొట్టిపాడులో 126 ఓట్లు, గుల్లదుర్తిలో 86 ఓట్లు మెజార్టీ లభించింది.

'అఖిలప్రియతో నియోజకవర్గం అభివృద్ధి'

చాగలమర్రి, జూన్ 6: ఎమ్మెల్యే అఖిలప్రియతో నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని దూదేకుల సంఘ అధ్యక్షుడు మహబూబ్‌బాషా అన్నారు. భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో గురువారం చాగలమర్రి బీసీ సంఘం కార్యాలయంలో అభినందనలు తెలిపారు. దూదేకుల సంఘం నాయకులు పీరయ్య, మస్తాన్, బాబయ్య, లాల్‌బాషా, ఇమామ్‌బాషా, బాల దస్తగిరి, ఉసేనయ్య తదితరులు పాల్గొన్నారు.

కూటమితోనే అఖండ విజయం

డోన్(రూరల్), జూన్ 6: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమితోనే అఖండ విజయం సాధ్యమైందని జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ గడ్డం బ్రహ్మం అన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలో జనసైనికులు గడ్డం బ్రహ్మంను పూలమాలలతో సన్మానించారు. కార్యక్రమంలో డోన్, ప్యాపిలి మం డలాల జనసైనికులు, చంద్ర, సునీల్, సురేంద్ర, అశోక్, చాంద్‌బాషా, జయ రాం పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త మృతి

బేతంచెర్ల, జూన్ 6 : పట్టణంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త కోటకొండ ప్రసాద్(42) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసకున్న పట్టణ టీడీపీ ప్రధాన కార్యదర్శి షేక్షావలి చౌదరి, టీడీపీ కార్యకర్త ఆవుల రామక్రిష్ణ మృతుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

బీసీ జనార్దన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

కోవెలకుంట్ల, జూన్ 6: బనగానపల్లె టీడీపీ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీ సాధించిన బీసీ జనార్దన్‌రెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర టీడీపీ కార్యదర్శి గడ్డం రామకృష్ణారెడ్డి, కోవెలకుంట్ల మాజీ మార్కెట్ యార్డు చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, కోవెలకుంట్ల సింగిల్ విండో మాజీ చైర్మన్ గువ్వల సుబ్బారెడ్డి, డాక్టర్ పేరా శ్రీధర్‌రెడ్డి కలుగొట్ల అర్జున్‌రెడ్డి, బిజనవేముల గజ్జల హుసేనయ్య, వల్లంపాడు సర్పంచ్ గార్లపాటి జగదీశ్వర్‌రెడ్డి కోరారు. గురువారం టీడీపీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలకు ఏసమస్య వచ్చినా ముందుండి బీసీ పరిష్కరించేవా రన్నారు.

నిందితులను అరెస్టు చేస్తాం: డీఎస్పీ

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6: మండలంలోని చింతలాయపల్లె గ్రామంలో వడ్డె నాగేంద్ర హత్య కేసులో నిందితులను త్వరలోనే అరెస్టు చేస్తామని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ పేర్కొన్నారు. గురువారం ఆయన చింతలాయపల్లె గ్రామానికి చేరుకొని హత్య జరిగిన సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఈయన వెంట సీఐ గోపినాథరెడ్డి, సంజామల ఎస్ఐ రమేష్‌రెడ్డి ఉన్నారు.

బుగ్గన కోటకు బీటలు

» కొంప ముంచిన అధికార అరాచకం
» పదేళ్ల తర్వాత డోన్‌లో ఎగిరిన టీడీపీ జెండా
» కోట్ల గెలుపుతో ఫలించిన చంద్రబాబు వ్యూహం

డోన్, జూన్ 6: వైసీపీ ప్రభుత్వంలో తిరుగులేని హవా నడిపిన బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి కోటకు బీటలు వారాయి. ఐదేళ్ల పాటు సాగించిన అరాచకాలే బుగ్గన కొంప ముంచాయి. పదేళ్ల తర్వాత డోన్ కోటపై టీడీపీ జెండ రెపరెపలాడింది. డోన్ ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపొందడంతో టీడీపీ అధినేత చంద్రబాబు వ్యూహం ఫలించింది. 2009 ఎన్నికల్లో టీడీపీ గెలిచిన తర్వాత జరిగిన రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ వైసీపీనే గెలుపొందింది. 2014 ఎన్నికల్లో డోన్ అసెంబ్లీ నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసిన బుగ్గన ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 2019 ఎన్నికల్లోనూ డోన్ ఎమ్మెల్యేగా రెండోసారి గెలిచిన బుగ్గన ఆర్థిక మంత్రిగా పని చేశారు. ఐదేళ్ల పాటు నియోజకవర్గంలో బుగ్గన అధికారం అండతో చెలరేగిపోయారన్న విమ ర్శలున్నాయి. టీడీపీ నాయకులను, వారి వ్యాపారాలను టార్గెట్ చేస్తూ బుగ్గన వేధింపులకు గురి చేస్తూ వచ్చారన్న ఆరోపణలున్నాయి. అదేవిధంగా బుగ్గనను ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలు చెప్పుకునే అవకాశం లేదు. అమరావతి, ఢిల్లీలోనే ఎక్కువ సమయం గడుపుతూ నియోజకవర్గంలో ప్రజలకు దూరమయ్యారు. అంతేగాక సొంత పార్టీ కేడర్‌ను బుగ్గన పట్టించుకోలేదని టాక్ ఉంది. వీటికి తోడు బేతంచెర్ల సొంత మండలంలోనే బుగ్గన తారా స్థాయిలో అరాచకాలను ప్రదర్శించారన్న ఆరోపణలున్నాయి. టీడీపీ నాయకులతో పాటు మైనింగ్ వ్యాపారులను టార్గెట్ చేసి ఇబ్బందులకు గురి చేశారన్న విమర్శలున్నాయి. అంతేగాక నియోజకవర్గంలో కొంతమంది బంధుగణానికి పెద్దపీట వేసి ఇష్టారాజ్యంగా దందాలు సాగించారన్న విమర్శలున్నాయి. దీంతో నియోజక వర్గంలో బుగ్గన తీరుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడడానికి ఇవన్నీ కారణాలే అయ్యాన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా బుగ్గన సాగిం చిన నియంతృత్వ పోకడలతో ఓటమిని చవిచూశారన్న చర్చ సాగుతోంది.

● **బుగ్గన కోటకు బీటలు:** బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సొంత మండలమైన బేతంచెర్లలోనే వైసీపీ కోటలు బీటలు వారాయి. మొదటి నుంచి బుగ్గనకు బేతంచెర్ల మండలం అండగా నిలుస్తూ వచ్చింది. అయితే బేతంచెర్లలోనే బుగ్గనపై తీవ్ర వ్యతిరేకత వచ్చిందనడానికి ప్రస్తుత ఎన్నికల ఫలితాలే నిదర్శనం. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డికి బేతంచెర్ల మండలంలోనే అత్యధిక మెజారిటీ లభించింది.

● **ఫలించిన చంద్రబాబు వ్యూహం:** టీడీపీ అధినేత చంద్రబాబు డోన్ నియోజకవర్గంలో అనుసరించిన వ్యూహం ఫలించింది. బుగ్గన ప్రాతినిధ్యం వహిస్తున్న డోన్ అసెంబ్లీపై చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించారు. డోన్ నియోజకవర్గంలో చంద్రబాబు ఎన్నో మార్పులు చేసుకుంటూ వచ్చారు. ఎన్నికల ముందు టీడీపీ కూటమి డోన్ అభ్యర్థిగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డిని బరిలో దింపారు. కేఈ వర్గం, ధర్మవరం సుబ్బారెడ్డి వర్గాలను సమన్వయం చేస్తూ చంద్రబాబు వ్యూహాలతో పావులు కదిపారు. వీటికి తోడు కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి చరిష్మా కలిసిరావడంతో డోన్‌లో టీడీపీ విజయకేతనం ఎగుర వేసింది. పదేళ్ల తర్వాత డోన్ నియోజకవర్గంలో టీడీపీ ఎమ్మెల్యే పదవిని సొం తం చేసుకోవడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కోట్ల గెలుపులో అండగా నిలిచిన సతీమణి సుజాతమ్మ

● **కోట్లకు అండగా ఆమె.** డోన్ నియోజకవర్గంలో టీడీపీ కూటమి అభ్యర్థి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపులో ఆయన సతీమణి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ అండగా నిలిచారు. నియోజకవర్గంలో భర్త గెలుపు కోసం సుజాతమ్మ అలుపెరుగని పోరాటం చేశారు. ఇంటింటికి తిరిగి, ప్రజల్లో మమేకం అవుతూ శ్రమించారు. గ్రామాలకు వెళ్లినప్పుడు సాధారణ మహిళగా రొట్టెలు చేస్తూ కోట్ల సుజాతమ్మ మహిళలను ఆకట్టుకున్నారు. ఇక కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి తనయుడు కోట్ల రాఘవేంద్రరెడ్డి, కూతుళ్లు కోట్ల నివేదిత, చిత్రమ్మలు ఎంతో శ్రమించారు. అదేవిధంగా నియోజకవర్గంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు కోట్ల గెలుపు కోసం ఎంతో కష్టపడి పని చేశారు. వాటి ఫలితంగానే డోన్‌లో టీడీపీ జెండా రెపరెపలాడింది.

బీసీ కుటుంబ సభ్యులకు అభినందనలు





బీసీ ఇందిరమ్మను అభినందిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బీసీ రాజారెడ్డిని సత్కరిస్తున్న అభిమానులు, టీడీపీ నాయకులు

బనగానపల్లె, జూన్ 6: బనగానపల్లె ఎమ్మెల్యేగా బీసీ జనార్దన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలవడంతో గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు టీడీపీ కార్యాయానికి చేరుకొని బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, సోదరుడు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డిలను పూలమాలలు, బొకేలతో టీడీపీ నాయకులు, అభిమానులు అభినందించారు. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపేందుకు భారీగా తరలివచ్చారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించినందుకు గజమాలలతో బీసీ ఇందిరమ్మను, బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డిలను సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. బీసీ ఇందిరమ్మ, బీసీ సోదరులు బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డిలతో వేర్వేరుగా కేక్‌లు కట్ చేయించి సంబరాలు చేసుకున్నారు. బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, సంజామల, కోవెలకుంట్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీడీపీ కార్యాలయం చేరుకుని వారిని అభినందించారు. ఈ సందర్భంగా బీసీ ఇందిరమ్మ, బీసీ రాజారెడ్డి, బీసీ రామనాథరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి విజయానికి కృషి చేసిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుపై మురుగు ప్రవాహం



కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయి రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగు

ఉయ్యాలవాడ, జూన్ 6: మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘ కార్యాలయం ఎదురుగా ఉన్న కాలువలోని మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోయి కాలువలలోని మురుగు రోడ్డెపై ప్రవహిస్తుంది. దీంతో అక్కడ దుర్గదం వెదజల్లుతోంది. వాహనదారులకు, పాదాచారులకు తీవ్ర ఆటకం కలుగుతోంది. నెలలు తరబడి డ్రైనేజీలో చెత్తాచెదారాన్ని తొలగించకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తింది. రోడ్డుపై పాచీ పేరుకపోవటంతో సైకిళ్లపై వెళ్లే చిన్నారులు, ద్విచక్రవాహనదారులు వాహనాలు అదుపుతప్పి కింద పడి గాయాలపాలవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పదించి డ్రైనేజీలోని పూడికను తీసివేసి మురుగు సజావుగా వెళ్లేలా చూడాలని ప్రజలు కోరతున్నారు. దీనిపై ఈవోపీఆర్డీ మహీంధర్‌రెడ్డిని వివరణ కోరడగా కాలువను శుభ్రం చేయిస్తామని చెప్పారు.

ఆంజనేయస్వామికి పూజలు



రుద్రవరంలో పూజలు చేస్తున్న భక్తులు

రుద్రవరం, జూన్ 6: రుద్రవరంలో పడమటి వీధిలో కొలువుదీరిన ప్రతాపరుద్ర ఆంజనేయస్వామికి కొండమాయపల్లె భాస్కరనందీశ్వర ఆలయాల్లో గురువారం ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు నిర్వహించారు. ఆకులతో, నిమ్మకాయలు, పూలతో ఆంజనేయస్వామి విగ్రహాలను అలంకరించారు. అర్చకుడు వారణాసి గోపిశర్మ అభిషేకం చేసి పూజలు ప్రారంభించారు. ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామికి అమావాస్య పూజలు చేసేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

బేతంచెర్ల: పట్టణ శివారులోని కొలుములపల్లె రస్తాలో వెలసిన ఆంజనేయస్వామికి భక్తులు గురువారం అమావాస్య పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకాలు, కుంకుమార్చన, ఆకు పూజలతోపాటు మహా మంగళహారతులిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఉత్సవ విగ్రహానికి వేద పండితుల మంత్రోచ్ఛరణాల మధ్య అభిషేకించారు. పారిశ్రామికవేత్త గుండా గోపాల్ దంపతులు, గ్రూపు దేవాలయాల చైర్మన్ గుండా జగన్మోహన్‌రావు దంపతులు ఆంజనేయస్వామికి అభిషేక పూజలు నిర్వహించారు.

ప్రజల రుణం తీర్చుకుంటా: కోట్ల







ఎమ్మెల్యే కోట్లకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చిన కార్యకర్తలు, కోట్ల సుజాతమ్మకు పుష్పగుచ్ఛం అందిస్తున్న టీడీపీ నాయకులు, తుంగభద్ర బోర్డు అధికారులతో మాట్లాడుతున్న కోట్ల

డోన్, జూన్ 6: డోన్ నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటానని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని కోట్ల నివాసానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మలకు పూలబొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ వైసీపీ అరాచక పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులకు గుర య్యార న్నారు. మళ్లీ చంద్రబాబు వస్తేనే రాష్ట్రం బాగుపడుతుందన్న నమ్మకం తో ఎన్డీయే కూటమికి ప్రజలు భారీ విజయం అందించారన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. టీడీపీ కూటమి విజయం కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో డోన్ మాజీ సర్పంచ్ టీఈ కేశవయ్యగౌడు, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ లక్కిరెడ్డి, మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు, ఓబులాపురం శేషిరెడ్డి, మర్రి రమణ, ఓంప్రకాష్, భాస్కర్ నాయుడు, రంజిత్ కిరణ్, బీజేపీ నాయకులు వడ్డె మహారాజ్, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డి, పరదేశి మహేష్ పాల్గొన్నారు.

చెరువులకు నీరు నింపుతాం: కోట్ల

డోన్ నియోజకవర్గంలో చెరువులకు నీరు నింపేందుకు కృషి చేస్తామని డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తన నివాసంలో ఎమ్మెల్యే కోట్ల తుంగభద్ర బోర్డు అధికారులతో సమావేశమయ్యారు. సాగు, తాగునీటి అంశాలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు ఎక్కువగా పడే అవకాశం ఉందని, జూలై చివరికంతా శ్రీశైలం జలాశయానికి నీరు చేరవచ్చన్నారు. హంద్రీ నీవా ప్రాజెక్టు కాల్వకు నీరు విడుదల చేసి డోన్, పత్తికొండ నియోజకవర్గాల్లో చెరువులకు నీళ్లు నింపేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని తుంగభద్ర బోర్డు అధికారులను ఆదేశించారు. గుండ్రేవుల ప్రాజెక్టు డీపీఆర్‌ను ప్రస్తుత ధరలకు అనుగుణంగా నివేదికలు సిద్ధం చేయాలని, ప్రభుత్వం నుంచి నిధులు విడుదలయ్యేలా తాను కృషి చేస్తానని అన్నారు. తుంగభద్ర రిజర్వాయరు నుంచి ఎల్లెల్సీ కాల్వకు సంబంధించిన పైపులైన్ డీపీఆర్‌ను వీలైనంత త్వరగా ఇవ్వాలని కోరారు. గాజులదిన్నె నుంచి డోన్, ప్యాపిలి, బేతంచెర్ల తాగునీటి సరఫరా చేసేందుకు త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. సమావేశంలో తుంగభద్ర బోర్డు ఎస్ఈ రెడ్డి శేఖర్ రెడ్డి, ఈఈ శైలేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

కొలిమిగుండ్లలో భారీ వర్షం

కొలిమిగుండ్ల రూరల్, జూన్ 6: మండలంలోని వివిధ గ్రామాలలో బుధవారం రాత్రి నుండి గురువారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని పలు గ్రామాలలో వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహించాయి. పలు కాలనీల్లో నీరు నిలిచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మరో వైపు మండలంలోని బెలుం గ్రామంలో వర్షపు నీరు సిద్ధ రామేశ్వరస్వామి ఆలయంలోకి చేరడంతో, స్వామి వారికి పూజలు నిలిచి పోయాయి. మండలంలో మొత్తం 31.8మిమీ వర్షం కురిసినట్లు ఏఎస్ఓ భాస్కరరెడ్డి వెల్లడించారు. మరో వైపు వర్షం కారణంగా విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని మదనంతపురం, చింతలాయపల్లె, మీర్జాపురం కొలిమిగుండ్ల తదితర గ్రామాల్లో రాత్రంతా విద్యుత్ సరఫరా నిలిచి పోవడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. భారీ వర్షం కారణంగా పలు గ్రామాల పంటపొలాల్లో పెద్ద ఎత్తున నీరు నిలిచింది.

బేతంచెర్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో, పట్టణంలో గత రాత్రి కురిసిన భారీ వర్షానికి కుంటలు, చెరువులు నిండి వాగులు, వంకలు పొంగి పొర్లాయి. మండలంలో 9.4 సెం.మీల వర్షపాతం నమోదైంది. బేతంచెర్ల-డోన్ రహదారిలో ముచ్చట్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం కొనసాగుతుండగా.. వర్షపునీరు వాటిని కొట్టుకుపోయేలా వాగు పొంగి పొర్లిందని, దీంతో డోన్‌కు వెళ్లే వాహనల రాకపోకలు నిలిచిపోయాయని స్థానికులు తెలిపారు.

చాగలమర్రి: చాగలమర్రి గ్రామంలో గురువారం మధ్యాహ్నం కుండపోత వర్షం కురిసింది. 15 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. ప్రభుత్వ వైద్యశాలలో వర్షపు నీరు ప్రవహించి జలమయంగా మారింది. ప్రభుత్వ పశువైద్యశాల, తహసీల్దార్ కార్యాలయాల ప్రాంగణాలు జలమయమయ్యాయి. ఆర్సీఎం పాఠశాల సమీపంలోని కాలువలోని మురుగు రహదారిపై ప్రవహించింది. నెల రోజుల నుంచి ఎండ వేడిమితో అల్లాడున్న ప్రజలకు వర్షం కురవడంతో ఊరటనిచ్చింది.



కొలిమిగుండ్ల మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వంక

ఆరుతడి పంటలకు ఊపిరిపోసిన వర్షం

శిరివెళ్ల: మండలంలోని రైతులు సాగు చేస్తున్న ఆరుతడి పంటలకు వర్షం ఊపిరిపోసింది. ఖరీఫ్ ప్రారంభంలో భాగంగా వరి పైరుకు ముందు పొలాల్లో రైతులు మినుము, పెసర, పిల్లిపెసర, జీలుగ తదితర పంటలను సాగు చేస్తున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో పంటలు కళకళలాడుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

అవినీతి పాలనకు చరమగీతం

బేతంచెర్ల, జూన్ 6: రాష్ట్రంలో వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడారని టీడీపీ మండల కన్వీనర్ ఎల్ల నాగయ, ఉన్నం చంద్రశేఖర్ అన్నారు. గురువారం సాయంత్రం మండలంలోని ఆర్ఎస్ రంగాపురం, కొలుములపల్లె, అంబాపురం గ్రామాల్లో డోన్ టీడీపీ కూటమి ఎమ్మెల్యేగా కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి గెలుపొందడంతో కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. నాయకులు పోలూరు రాఘవరావు, పట్టణ టీడీపీ సమన్వయ చైర్మన్ సుధాకర్, శేషశైనా రెడ్డి, లొడ్డా శేఖర్, నల్లారెడ్డి, అంబాపురం సర్పంచ్ శ్రీనివాస యాదవ్ పాల్గొన్నారు.

'ధర్మ ప్రచారం అందరి బాధ్యత'

చాగలమర్రి, జూన్ 6: ధర్మప్రచారం అందరి బాధ్యతని అభినవ శంకరానందస్వామి అన్నారు. గురువారం చాగలమర్రి శివరామానంద ఆశ్రమంలో పీఠాధిపతి అభినవ శంకరానందస్వామి పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. హిందూ సంఘం సభ్యులు సుబ్బయ్య, రాజు, రవీంద్రారెడ్డి, దస్తగిరి, మురళీ, వెంకట్రామిరెడ్డి, రంగనాయకులు, దస్తగిరి, జగన్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

'గ్రామాల్లో నిఘా కొనసాగించండి'

ఉయ్యాలవాడ, జూన్ 6: మండలంలోని అన్ని గ్రామాల్లో శాంతి భద్రలపై నిఘా కొనసాగించాలని సీఐ హనుమంతనాయక్ సూచించారు. గురువారం స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కౌటింగ్ ముగిసినందున గ్రామాల్లో అల్లరు, ఘర్షణలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అల్లరి మూకలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఎస్ఐ రామాంజనేయరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ రఫీ, కానిస్టేబుళ్లు సుబ్బారెడ్డి, రమేష్ ఉన్నారు.

ఆలయం రోడ్డుకు రూ.లక్ష విరాళం

డోన్(రూరల్), జూన్ 6: డోన్ మండలం ఆవులదొడ్డి గ్రామ సమీపంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయం రోడ్డు అభివృద్ధికి డోన్ మాజీ ఎంపీపీ శేషఫణిగౌడు రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ ధర్మకర్త, జనసేన నాయకులు ఆలా మోహన్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ శేషఫణి గౌడు మాట్లాడుతూ ఆవులదొడ్డి లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి తన వంతు సహకారం అందిస్తానన్నారు.

అన్ని మండలాల్లో టీడీపీ విజయదుందుభి

బనగానపల్లె మండలంలో అత్యధికంగా 13,741 ఓట్లు

బనగానపల్లె, జూన్ 6: బనగానపల్లె నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా బీసీ జనార్దన్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలిచి విజయదుందుభి మోగించారు. నియోజకర్గంలోని బనగానపల్లె, అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల, సంజామల మండలాల్లో మెజార్టీ సాధించారు. వైసీపీకి ఒక్క మండలంలో కూడా ఈసారి మెజార్టీ రాలేదు. అవుకు మండలంలో ఈసారి ఒక్క ఉప్పలపాడు, జూనూతల గ్రామాల్లో తప్ప మిగతా గ్రామాల్లో ప్రజలు స్వచ్ఛందంగా 40 ఏళ్ల తర్వాత ఓటుహక్కును వినియోగించుకున్నారు. చివరకు ఉపాధ్యాయులు, ఉద్యోగులు, చిరుద్యోగులు పోస్టల్ బ్యాలెట్‌లో కూడా టీడీపీకి ఓటు వేసి బీసీ విజయానికి తోడ్పడ్డారు. అలాగే నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, వికలాంగులు సైతం టీడీపీకి ఓట్లు వేసి వైసీపీని కుమ్మేశారు. బనగానపల్లె మండలంలో టీడీపీకి 40,420 ఓట్లు రాగా, వైసీపీకి 26,679 ఓట్లు రాగా టీడీపీకి బనగానపల్లె మండలంలో 13,741 ఓట్లు టీడీపీకి మెజార్టీ లభించింది. కోవెలకుంట్ల మండలంలో టీడీపీకి 17,690 ఓట్లు రాగా, వైసీపీకి 12,929 ఓట్లు రాగా టీడీపీకి మెజార్టీ 4,761 ఓట్లు మెజార్టీ వచ్చింది. కొలిమిగుండ్ల మండలంలో టీడీపీకి 19,308 ఓట్లు రాగా, వైసీపీకి 16,870 ఓట్లు వచ్చాయి. కొలిమిగుండ్ల మండలంలో టీడీపీకి 2,438 ఓట్లు వచ్చాయి. అవుకు మండలంలో టీడీపీకి 17,298 ఓట్లు రాగా, వైసీపీకి 15,632 ఓట్లు వచ్చాయి. దీంతో అవుకు మండలంలో టీడీపీకి మెజార్టీ 1,666 ఓట్లు వచ్చాయి. సంజామల మండలంలో టీడీపీకి 14,478 ఓట్లు టీడీపీకి రాగా వైసీపీకి 12,210 ఓట్లు వచ్చాయి. సంజామల మండలంలో టీడీపీకి 2,268 ఓట్లు మెజార్టీ వచ్చింది. దీంతో 5 మండలాల్లో 24,874 ఓట్లు టీడీపీకి ఈవీఎంల ద్వారా మెజార్టీ వచ్చింది. అయితే పోస్టల్ బ్యాలెట్ ద్వారా 692 ఓట్లు టీడీపీకి వచ్చాయి. దీంతో బనగానపల్లె నియోజవకర్గంలోని ఈవీఎంల, పోస్టల్ బ్యాలెట్‌ల ద్వారా 25,566 ఓట్ల మెజార్టీతో టీడీపీ ఘన విజయం సాధించింది.

కోవెలకుంట్లలో టీడీపీ హవా

కోవెలకుంట్ల, జూన్ 6: మండలంలో టీడీపీ హవా కొనసాగింది. మొదటిసారిగా మండలంలో బీసీ జనార్ధనరెడ్డికి 5000 ఓట్ల భారీ మెజార్టీ అందించారు. కోవెలకుంట్ల పట్టణంలో టీడీపీకి 3178ఓట్ల భారీ మెజార్టీ అం దించడం టీడీపీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. మరోవైపు కోవెల కుంట్లలో హేమాహెమీ నాయకులు, ప్రజాప్రతినిధులు వైసీపీ వైపే ఉన్నప్ప టికీ ప్రజలు మాత్రం టీడీపీని ఆదరించడం వైసీపీ శ్రేణులను విస్మయానికి గురిచేసింది. కలుగొట్ల గ్రామానికి చెందిన టీడీపీ నేత అర్జున్‌రెడ్డి 352ఓట్లు మెజార్టీ రావడంతో సంబరాలు చేసుకున్నారు. బిజినవేముల గ్రామంలో గజ్జల హుసేనయ్య, పొట్టిపాడులో గువ్వల సుబ్బారెడ్డి, వల్లంపాడులో సర్పంచ్ గార్లపాటి జగదీశ్వరరెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. గుంజల పాడు, లింగాలలో టీడీపీకి మెజార్టీ లభించింది.

టీడీపీ గెలుపుపై నాయకుల హర్షం

దొర్నిపాడు, జూన్ 6: సార్వత్రిక ఎన్నికల్లో ఆళ్లగడ్డ ఎమ్మెల్యేగా భూమా అఖిలప్రియ విజయం సాధించడంతో మండలంలోని చాకరాజువేముల, దొర్నిపాడు, భాగ్యనగరం, రామచంద్రాపురం గ్రామాల్లో టీడీపీ నాయకులు మల్లేశ్వర చౌదరి, సిద్ధి సత్యం, కొత్తపల్లి సురేంద్ర, బొబ్బూరి వెంకటస్వామి, దయానందరావు కేక్ కట్ చేశారు. మాజీ ఎంపీపీ భూమా బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.